క్లుప్తంగా

వాహనదారులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 10మందికి జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 10 మందిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న అధికారులు

హత్నూర (సంగారెడ్డి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని చీకుమద్దూర్, నవాబుపేట, హత్నూర, నాగుల్దేరిపల్లి, దౌలాపూర్, దౌల్తాబాద్, దేవులపల్లి, చందాపూర్ గుండ్ల మాచనూర్, తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం దేవేందర్, ఏవో శ్రీనివాస్, ఏఈఓ ప్రేమ్ రాజ్, సీసీలు కిష్టయ్య, మహేష్, నాగరాణి, వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



గెలుపొందిన జట్టుకు నగదు అందజేస్తున్న రమేష్ చౌహాన్

నారాయణఖేడ్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ తెలిపారు. ఖేడ్ మండల పరిధిలోని చల్లగిద్ద తండాలో ఇటీవల నిర్వహించిన క్రికెట్ టోర్నీలో చల్లగిద్ద తండా జట్టు గెలుపొందగా మొదటి బహుమతిగా రూ.11,111, నాగల్‌గిద్ద మండలంలోని గోప్యానాయక్ తండాకు చెందిన జట్టు ద్వితీయస్థానంలో నిలవగా రూ.5,555 నగదును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో రాజునాయక్, రవి, సంతోష్, మోహన్, సంపత్ నాయక్ పాల్గొన్నారు.

డీఎస్పీ అభ్యర్థిగా జీవన్



జీవన్‌కుమార్

నారాయణఖేడ్: ఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గ ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) అభ్యర్థిగా అలిగే జీవన్‌కుమార్‌ను ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ తెలిపారు. ప్రకటించారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడుతూ 90శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అణగారిన వర్గాలకు న్యాయం జరగాలంటే డీఎస్పీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. టార్చ్‌లైట్ గుర్తుకు ఓట్లు వేసి తనను గెలిపించాలని కోరారు.

రసాయన పరిశ్రమల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని గుండ్ల మాచనూర్ గ్రామ శివారులోని ఫార్మా పరిశ్రమలపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. కోవలంట్ లాబరేటరీస్, ఆపటోరియా, హానర్ ల్యాబ్ పరిశ్రమల్లో తనిఖీలు చేసి వివరాలు సేకరించారు. పలు పరిశ్రమల్లో నిబంధనలు పాటించకపోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు తీవ్ర పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రధానంగా కోవలెంట్ లేబరేటరీ పరిశ్రమలో దుర్వాసన నియంత్రణకు సూచనలు చేసినట్లు తెలిపారు. తమ విచారణ పూర్తి నివేదికను రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి అందజేయనున్నట్లు వివరించారు. తనిఖీలలో సంగారెడ్డి పీసీబీ ఈఈ గీతాసఫారీ, ఏఈలు భాగ్యలక్ష్మి, శ్రావణ్, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్, జేఎన్టీయూ కూకట్‌పల్లి ప్రొఫెసర్ లక్ష్మి, పూజ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం



బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు

జహీరాబాద్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం అన్నారు. మొగుడంపల్లి మండల పరిధిలోని ఉప్పర్‌పల్లితండా, హరిచంద్ నాయక్ తండా, విఠునాయక్ తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని సంక్షేమం, అభివృద్ధి పనులను చేపడుతూ సీఎం కేసీఆర్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా, డబుల్ బెడ్ రూం, రుణమాఫీ తదితర పథకాలను ప్రవేశపెట్టి అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వివరించారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడి పోయిందన్నారు. అప్పుడు అభివృద్ధి చేయలేనివారు ఇప్పుడు ఎలా చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల కల్లబొల్లి మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యే గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరుణమోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కిషన్‌పవార్, మాణిక్యమ్మ, విజయ్‌కుమార్, చిరంజీవి, నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, పెంటారెడ్డి, సంజీవరెడ్డి, కుత్‌బుద్దీన్, శంకర్‌నాయక్, కేషురాథోడ్, నారాయణ, గోపాల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

జహీరాబాద్: మండల పరిధిలోని పస్తాపూర్ గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నరోత్తం మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరినవారిలో నాయకులు రాములు, చంద్రయ్య, మల్కయ్య, రవి, అన్సార్, నసీర్, రాజు, బల్‌రాం, బక్కప్ప, మాణిక్, చిరంజీవి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మసూద్ హుసేన్, కృష్ణ, గోపాల్, మాణిక్‌ప్రభుగౌడ్ పాల్గొన్నారు.

సీఎం సభాస్థలి పరిశీలన



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎస్పీ రూపేష్, అధికారులు

నారాయణఖేడ్: ప్రజాఆశీర్వాద సభలో భాగంగా నారాయణఖేడ్‌లో ఈ నెల 30న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగసభకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ చెన్నూరి రూపేష్ శుక్రవారం వేర్వేరుగా పరిశీలించారు. పట్టణంలోని రహమాన్ ఫంక్షన్‌హాల్ సమీపంలో బహిరంగసభ నిర్వహించనున్న సందర్భంగా హెలిప్యాడ్ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సభకు వచ్చే జనాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తీసుకునే చర్యలు, ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల పార్కింగ్, బందోబస్తు, తదితర అంశాలకు సంబంధించి ఎస్పీ రూపేష్ ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డిలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా సభకు చేస్తున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరిశీలించారు. ఆయనవెంట మున్సిపల్ చైర్మన్ నజీబ్, వైస్‌చైర్మన్ పరశురాం, నాయకులు వంశీధర్‌రెడ్డి, అంజాగౌడ్, సంగప్ప, రాజు, సంజీవ్‌సాగర్, హిదాయత్‌అలీ తదితరులు ఉన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఘనంగా గ్యార్మీ ఉత్సవాలు

కంది(సంగారెడ్డి): మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో వార్డుసభ్యులు సయ్యద్‌గౌస్, తయాబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్యార్మీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు హకీం, జిల్లా నాయకులు కృష్ణగౌడ్, మోహన్‌రెడ్డి, ముఖీమ్ పాల్గొని మహబూబ్ సుబానిదర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాల్లో మతపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్యారంటీలను గడపగడపకు చేర్చండి

ఎమ్మెల్యే జగ్గారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గారెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను గడపగడపకు చేర్చాలని ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. ఈ నెల 29న సంగారెడ్డిలో నిర్వహించనున్న బహిరంగసభను విజయవంతం చేయాలని కోరుతూ మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రతి మండలం నుంచి వేలసంఖ్యలో జన సమీకరణ, భారీర్యాలీలు నిర్వహించాలని బ్లాక్ కాంగ్రెస్, అధ్యక్షులకు సూచించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మల్లికార్జునఖర్గేకు ఘన స్వాగతం పలకాలన్నారు. బహిరంగసభకు తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, శాసనసభాపక్ష నాయకుడు భట్టి విక్రమార్క, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సంగారెడ్డి, సదాశివపేట, కొండాపూర్, కంది మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, సంగారెడ్డి, సదాశివపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోచుకునేందుకే ‘ధరణి’

- బంగారు తెలంగాణ కాదు.. బార్ల తెలంగాణగా మార్చారు
- అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి దామోదర

వట్‌పల్లి(అందోల్): విలువైన భూములను కొల్లగొట్టేందుకు కోసమే ప్రభుత్వం ధరణి వెబ్‌సైట్‌ను తీసుకొచ్చిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ ఆరోపించారు. వట్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వకుండా రైతుల హక్కులను కాలరాసేందుకు ప్రభుత్వం ధరణి వెబ్‌సైట్‌ను తెచ్చి ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. ధరణితో గ్రామగ్రామాన భూ సమస్యలు పెరిగిపోయాయని వాపోయారు. కాంగ్రెస్ పాలనలో అర్హులైనవారందరికీ భూములు, ఇళ్లు ఇచ్చామన్నారు. 60ఏళ్ల కాంగ్రెస్ పాలనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్లు ఏనాడూ లీకేజీలు కాలేవని, మెగా డీఎస్సీలు వేసి ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. రాష్ట్రాన్ని రూ.5లక్షల కోట్ల అప్పుల తెలంగాణ మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గానికి సింగూర్ జలాలను అందించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. అంతేకాకుండా మండలానికొక రెసిడెన్షియల్, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. అమూల్యమైన ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వట్‌పల్లి, అల్లాదుర్గం, రేగోడు మండలాల పార్టీ అధ్యక్షులు రమేష్ జ్యోషి, శేషారెడ్డి, దిగంబర్‌రావు, జెడ్పీటీసీ యాదగిరి, మాజీ జెడ్పీటీసీలు రాజేందర్ పాటిల్, రాంరెడ్డి, జానయ్య, పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, స్కోర్ మాజీ చైర్మన్ సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న దామోదర రాజనర్సింహ

కాంగ్రెస్‌లో చేరికలు...

బీఆర్‌ఎస్ చెందిన సీనియర్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అల్లాదుర్గం మండల మాజీ అధ్యక్షుడు సుభాష్‌రావు, దుద్యాల శ్రీశైలం, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరినవారికి మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అవకాశమివ్వండి.. అభివృద్ధి చేస్తా

బీజేపీ అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అవకాశమిచ్చి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్ అన్నారు. రామచంద్రాపురం పట్టణంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు మార్పును కోరుకుంటున్నారన్నారు. పదేళ్ల కాలంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. భారీ మెజార్టీతో ఓటర్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

చెట్లమందుల తయారీపై అవగాహన



చెట్ల మందులపై అవగాహన కల్పిస్తున్న పూలమ్మ

జహీరాబాద్: మండలంలోని జీడిగడ్డ తండాలో డీడీఎస్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా జాతా కోఆర్డినేటర్ పూలమ్మ మాట్లాడుతూ ఒకప్పుడు చెట్ల ఆకులతో మందులను తయారు చేసుకుని చిన్నచిన్న వ్యాధులకు వారే వైద్యం చేసుకునేవారన్నారు. వీటి గురించి నేటి తరానికి తెలియని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. తమవంతుగా తిరిగి చెట్ల మందుల గురించి తెలియజేసేందుకు గాను జాతర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఏయే చెట్ల మందులకు ఎలాంటి రోగాలను నయం చేసుకోవచ్చనేదానిపై తండాలు, గ్రామాల్లోని సంఘాలకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీడీఎస్ సభ్యులు మంజుల, చంద్రమ్మ, పారమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కోహీర్(జహీరాబాద్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని రాయిపల్లి చౌరస్తా వద్ద శుక్రవారం సాయంత్రం చోటుచేసుకొంది. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ మండలంలోని రాయిపల్లి గ్రామానికి చెందిన చాకలి నర్సింహులు (52) సొంతపని నిమిత్తం మోటారు సైకిల్‌పై కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన నర్సింహులును జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య ఇందిరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటింటా ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మునిపల్లి(అందోల్): బీఆర్‌ఎస్ అభ్యర్థి అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌కు ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ శైలజ, జడ్పీటీసీ మీనాక్షి ఆధ్వర్యంలో మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. చీలపల్లి ఎంపీటీసీ లక్ష్మి, నాయకులు శివశంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

మునిపల్లి(అందోల్): మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహకు మద్దతుగా మునిపల్లి మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మల్లేశం అధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని హైద్లాపూర్ గ్రామంలో బైక్ ర్యాలీతో పాటు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామశాఖ అధ్యక్షులు హుస్సెన్, కుమార్, ప్రకాశ్, జైపాల్ పాల్గొన్నారు.

పరిశ్రమలో అగ్నిప్రమాదం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలోని హైగ్రో కెమికల్ ఫార్మాటెక్ పరిశ్రమలో శుక్రవారం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కార్మికులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం 2గంటల సమయంలో టోలిన్ ద్రావణాన్ని డ్రమ్ముల నుంచి రియాక్టర్‌లోకి తరలిస్తుండగా ఒకేసారి మండలు రావడంతో పరిశ్రమ సిబ్బంది అప్రమత్తమై వెంటనే మంటలను ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న బొల్లారం బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ఆనంద్‌కృష్ణారెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని కార్మికులను అప్రమత్తం చేశాడు. ఎలాంటి ప్రాణ,ఆస్తి నష్టం జరగలేదని సీఐ నయిమొద్దీన్ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపోలో ఈనెల 28న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం మల్లేశయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో పరిధిలోని గ్రామాల ప్రజలు, ప్రయాణికులు సమస్యల పరిష్కారంపై 9440149896 నెంబరుకు ఫోన్‌చేసి సలహాలు, సూచనలుల ఇవ్వాలని కోరారు.

వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష

హత్నూర(సంగారెడ్డి): మహిళపై దాడిచేసి అవమానించిన వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.200నగదు జరిమానా విధిస్తూ సంగారెడ్డి జిల్లా ప్రత్యేక మొబైల్ కోర్టు జడ్జి అనిత తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా హత్నూర ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని నవాబుపేట గ్రామానికి చెందిన మహిళ 2016 నవంబర్ 4న ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసిన అదే గ్రామానికి చెందిన నాగ అబ్రహం తండ్రి అర్జున్ మహిళపై దాడిచేసి అవమానించాడు. బాధిత మహిళ ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ బాల్‌రెడ్డి కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కోర్టు చార్జిషీట్ దాఖలు చేయగా కేసు వాదోపవాదాలు విన్న తరువాత శుక్రవారం సంగారెడ్డి ప్రత్యేక మొబైల్ కోర్టు జడ్జి అనిత నిందితుడికి రూ.200 నగదుతో పాటు రెండేళ్ల జైలుశిక్ష విధించింది. సాక్షాలు సమర్పించడంలో కీలకంగా వ్యవహరించిన కోర్టు కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలంలోని రుద్రారం గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు గుర్తుతెలియని వ్యక్తి ఈ నెల 24న తన బైక్‌లో పెట్రోల్ అయిపోయిందని, బాటిల్‌లో పెట్రోల్ పోయాలని విజ్ఞప్తి చేసి తీసుకెళ్లాడు. తీసుకెళ్లిన కొద్దిసేపటికి కాలిన గాయాలతో ఆ వ్యక్తి పెట్రోల్ బంక్ వద్దకు వచ్చాడు. దీంతో పెట్రోల్ బంక్ నిర్వాహకులు అతనిని చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గురువారం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కేదార్ జగద్గురుల ఆధ్వర్యంలో శివస్తుతి

నారాయణఖేడ్: ఖేడ్ బసవ మంటపంలో నారాయణఖేడ్ నియోజకవర్గ జంగమ సమాజ్ ప్రధాన కార్యదర్శి రేవణయ్యస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జంగమసమాజ్ బాధ్యులు, జంగమ భక్తులు పాల్గొన్నారు.

‘పట్నం’కు కీలక బాధ్యతలు



పట్నం మాణిక్యం

సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యంకు బీఆర్‌ఎస్ సంగారెడ్డి నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా నియమించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆ పార్టీ అధినాయకత్వం ఈ బాధ్యతలను అప్పగించింది. పట్నం మాణిక్యం సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించారు. ఎలాగైనా ఈసారి ఎన్నికల బరిలో ఉంటానని ప్రకటించారు. ఈ మేరకు తన అనుచరులతో సమావేశాలు సైతం నిర్వహించి పోటీ చేస్తానని ప్రకటించారు. అయితే టికెట్ హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్‌కు దక్కింది. దీంతో అసమ్మతి రాగం వినిపించిన పట్నం మాణిక్యంను మంత్రి హరీశ్‌రావు బుజ్జగించారు. సముచిత స్థానంతో గౌరవించుకుంటామని హామీనిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సంగారెడ్డిలోని చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాణిక్యం మాట్లాడుతూ చింతా ప్రభాకర్ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన మెనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు

జిన్నారం(పటాన్‌చెరు): రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ ఆశోక్‌తో పాటు ఆయన అనుచరులు శుక్రవారం కాట శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మర్చిపోయిందన్నారు. తెలంగాణను ఇచ్చిన సోనియాగాంధీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలతో తప్పకుండా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణ, ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నాయకులు నర్సింగ్‌రావు, రాజుగౌడ్, లక్ష్మణ్, రవి, రమేష్, మహేష్, నరేష్, రాజిరెడ్డి, జయశంకర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి నరేందర్, అర్జున్ పాల్గొన్నారు.

సదాశివపేట రూరల్‌లో...

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెల్టూర్ గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ నవీన్‌కుమార్‌తో పాటు పలువురు శుక్రవారం సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి, మండల అధ్యక్షుడు సిద్దన్న, నాయకులు ప్రభు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మృతి



ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

రాయికోద్(అందోల్): సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, సంగాపూర్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం మృతి చెందారు. కొంతకాలంగా ప్రభాకర్‌రెడ్డి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారని వివిధ పార్టీల నాయకులు, అభిమానులు ఆయన సేవలను కొనియాడారు. ప్రభాకర్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చేపపిల్లల పంపిణీ



చేపపిల్లలను వదులుతున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలో మత్స్యశాఖ అధికారి శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం 3.12లక్షల చేపపిల్లల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని రాయినిచెరువులో చేపపిల్లలను వదిలామన్నారు. చేపపిల్లలను పంపిణీ చేసిన మత్స్యశాఖ అధికారులకు మత్స్యశాఖ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకారులు రమేష్, కృష్ణ, మధు, నర్సింహులు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.